క్లుప్తంగా

భక్తాంజనేయస్వామి ఆలయంలో పూజలు


పూజలు చేస్తున్న అర్చకుడు

గంగాధరనెల్లూరు: వేపంజేరిలోని శ్రీభక్తాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం సుగంధభరిత ద్రవ్యాలతో స్వామివారిని అభిషేకించారు. వడమాల, ఆకుపూజ చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఉభయదారులుగా వేపంజేరికి చెందిన గుణశేఖర్ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. అనంతరం గోశాలలో గోపూజ చేశారు. భక్తులు గోమాతకు ప్రదక్షిణ చేసి మొక్కులు తీర్చుకున్నారు.

సచివాలయాన్ని తనిఖీ చేసిన జెడ్పీ సీఈఓ


నోటీస్ బోర్డును పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ

శ్రీరంగరాజపురం: మండలంలోని 49 కొత్తపల్లి సచివాలయాన్ని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. పథకాల లబ్ధిదారుల వివరాలు, పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల మేరకు సచివాలయ సిబ్బంది తప్పక యూనిఫాం ధరించాలని, సమయ పాలన పాటించాలని తెలిపారు. లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. ఎంపీడీఓ కృష్ణయ్య, పంచాయితీ కార్యదర్శి బాలరాజు ఉన్నారు.

సప్లిమెంటరీ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు


ప్రత్యేక తరగతులను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్

పుత్తూరు రూరల్: ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకుని సప్లిమెంటరీ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తీర్ణులు కావాలని స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గోపాల్ రెడ్డి సూచించారు. ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు మంగళవారం కళాశాలలో ప్రత్యేక తరగతులను ఆయన ప్రారంభించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు వసతి సౌకర్యం సైతం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్ష ఫీజు చెల్లించి తరగతులకు హాజరుకావాలని కోరారు. ఈనెల 24 నుంచి పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

ఉచితంగా ఆర్వో వాటర్ సరఫరా


తాగునీరు సరఫరా చేస్తున్న సర్పంచ్

విజయపురం (నగరి): మండల కేంద్రంలోని ఎస్టీ కాలనీ ప్రజలకు సర్పంచ్ జబమేరి భర్త ప్రసన్న కుమార్ ఇంటింటికీ ఆర్వో వాటర్‌ను మంగళవారం ఉచితంగా సరఫరా చేశారు. గ్రామంలోని తాగునీటి మోటార్ మరమ్మతు గురైంది. దీంతో సర్పంచ్ సొంతంగా ఆటో పెట్టి కాలనీలో వంద నీటి క్యాన్లను సరఫరా చేశారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ముత్తుమారియమ్మకు అంబళ్లు


అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

పాలసముద్రం: శ్రీకావేరిరాజుపురం గ్రామంలో వెలసిన ముత్తుమారియమ్మకు మంగళవారం గ్రామస్తులు అంబలి పోసి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారిని పాలు, పెరుగు, చందనం, నెయ్యి, తేనెతో అభిషేకించారు. మధ్యాహ్నం ప్రతి ఇంటి నుంచి మహిళలు పంబ వాయిద్యాలతో అంబలి, పూజ సామగ్రితో ఊరేగింపు వచ్చి అమ్మవారికి అంబలి సమర్పించారు. సాయంత్రం పొంగళ్లు పెట్టి, దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి

విజయపురం (నగరి): వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ సతీష్ అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. తాగునీరు, పారిశుద్ధ్యంపై చర్చించారు. తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పాడి, తడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ జగనన్న కాలనీలో పర్యటించి, అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని ఆదేశించారు.

నవరత్నాలే ప్రజల జీవనాడి

- డిప్యూటీ సీఎం నారాయణస్వామి


ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

శ్రీరంగరాజపురం: నవరత్నాల పథకాలు ప్రజలకు జీవనాడి లాంటిదని ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి అన్నారు. మంగళవారం శ్రీరంగరాజపురం మండలం కటికపల్లి సచివాలయ పరిధిలోని కనికాపురం, 49 ఒడ్డుపల్లి, ఒడ్డుపల్లి దళితవాడ, కటికపల్లి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ప్రజల సమస్యను అడిగి తెలుసుకున్నారు. నారాయణస్వామి మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రాబందులన్నీ ఒక్కటయ్యాయి

వచ్చే ఎన్నికల్లో జగనన్నను ఓడించేందుకు రాబందులన్నీ ఒకటయ్యారని అన్నారు. టీడీపీ, జనసేన అవినీతి డబ్బుతో ఓటుకు రూ.10 వేలు పంచడానికి సిద్ధమయ్యాయన్నారు. రాష్ట్ర ప్రజలకు సువర్ణ పాలన కావాలంటే జగనన్నకు మద్దతుగా నిలవాలని కోరారు. ప్రతి సామాజికవర్గం ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందలన్నాదే సీఎం జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని చెప్పారు. ముఖ్యంగా మహిళా ఆర్థిక స్వావలంబనకు విప్లవాత్మకమైన పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. మహిళా రక్షణకు దిశ చట్టంతో భరోసా కల్పించారన్నారు. టీడీపీ నేతలకు సైతం సంక్షేమ పథకాలు అందిస్తుంటే ఎల్లో మీడియా అసత్య ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను దోపిడీ చేశారని విమర్శించారు.

సమస్యలపై వినతి

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, గ్రామంలో శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని ఒడ్డుపల్లి కాలనీ వాసులు నారాయణస్వామిని కోరారు. స్పందించిన ఆయన వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు మెరుగైన సేవలు అందించడం కోసం సచివాలయ వ్యవస్థ తీసుకొస్తే, కొందరు ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయ సిబ్బంది వారానికి రెండు సార్లు గ్రామాలకు వెళ్లి సమస్యలను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. మండల, జిల్లా స్థాయి అధికారులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, తహసీల్దార్ లోకనాథ పిళ్లై, ఎంపీడీఓ కృష్ణయ్య, జెడ్పీటీసీ సభ్యుడు రమణప్రసాద్ రెడ్డి, సర్పంచ్ మార్కొండయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మణి, పార్టీ నాయకులు చంద్రయ్య నాయుడు, చిన్ని, రాజీవ్ చంద్రబోస్, ఆనందమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం కావాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసన్

పాలసముద్రం: జగనన్న కాలనీల్లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసన్ అన్నారు. మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. జగనన్న లేఅవుట్‌లో గృహనిర్మాణ పనులు పూర్తి చేసి సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని సూచించారు. పలుచోట్ల పనులు సక్రమంగా జరగడం లేదని.. లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణాలను పూర్తి చేయాల్సిన బాధ్యత ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై ఉందన్నారు. కాలనీల్లో తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. సకాలంలో బిల్లులు మంజూరు చేస్తున్నామని చెప్పారు.

జాగ్రత్తలతో ఫైలేరియా నివారణ


రోగులకు కిట్లు అందజేస్తున్న అధికారులు, నేతలు

వెదురుకుప్పం: ప్రభుత్వం వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు జిల్లా ఫైలేరియా నివారణ అధికారి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండలంలోని పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫైలేరియా (బోధకాలు) రోగులకు కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు మెరుగైన వైద్యం అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వాసుపత్రులను ఆధునికీకరించినట్లు చెప్పారు. ఫైలేరియా రహిత సమాజాన్ని నిర్మించేందుకు కృషి చేయాలన్నారు. ఫైలేరియా నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. బోధకాల వ్యాధిగ్రస్తులు సరైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిరంతరం సబ్బుతో శుభ్రం చేసుకోవడంతో పాటు దుమ్మూధూళి చేరకుండా చూడాలని సూచించారు. క్యూలెక్స్ ఆడ దోమ వల్ల ఈ వ్యాధి వ్యాపిస్తుందన్నారు. ఆరోగ్య సిబ్బంది అందించే సూచనలు, సలహాలను పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. వెదురుకుప్పం మండలంలో అధికంగా బోధకాలు వ్యాధిగ్రస్తులు ఉన్నట్లు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి మాట్లాడుతూ.. ఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అనంతరం బోధకాలను శుభ్రం చేసుకునే విధానాన్ని వివరించారు. చివరిగా 198 మంది రోగులకు ఉచితంగా కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాంబేడు ఎంపీటీసీ సభ్యుడు గుణశేఖర్, వైద్యాధికారిణి సురేఖ, పుత్తూరు సబ్ యూనిట్ అధికారి మోహన్, సీహెచ్‌ఓ వెంకటరమణయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు బండి హేమసుందర్ రెడ్డి, బండి గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు మంత్రి ఆర్కే రోజా పర్యటన

నగరి: నియోజకవర్గంలో బుధవారం నిర్వహించే పలు కార్యక్రమాల్లో మంత్రి ఆర్కేరోజా పాల్గొననున్నారు. ఉదయం 10.30 గంటలకు వడమాలపేటలోని సీఎంఆర్ గార్డెన్స్‌లో నిర్వహించే వైఎస్సార్‌సీపీ మండల కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. అనంతరం సాయంత్రం 4 గంటల నుంచి నగరి మున్సిపాలిటీ ఇందిరానగర్ సచివాలయం పరిధిలోని 11వ వార్డ్ రామ్‌నగర్ ఏ,బీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

అయ్యప్ప ఆలయంలో ఉత్తరానక్షత్ర పూజలు

నగరి: పట్టణ పరిధిలోని శ్రీధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయంలో మంగళవారం ఉత్తరానక్షత్ర పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వామి విగ్రహాన్ని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అయ్యప్ప భజనలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది.

రేపు మామిడి రైతులకు అవగాహన సదస్సు

పుత్తూరు రూరల్: స్థానిక మార్కెట్ యార్డ్‌లో గురువారం మధ్యాహ్నం 2:30 గంటలకు మామిడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ఆర్.జగదీష్ ఒక ప్రకటనలో తెలిపారు. మామిడి సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ఆహార భద్రత విభాగం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. హానికర రసాయనాల నియంత్రణ తదితర అంశాలపై అవగాహన కలిప్తామన్నారు. మామిడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు

చంద్రగిరి(తిరుపతి రూరల్) చంద్రగిరి మండలం మట్టంపల్లె వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. రేణిగుంట మండలం పాపనాయుడుపేటకు చెందిన రాజేష్ బైక్‌పై చిత్తూరుకు వెళుతుండగా మఠంపల్లి సమీపంలో బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రాజేష్ కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడికి చంద్రగిరి 108 సిబ్బంది చంద్రశేఖర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి ప్రథమ చికిత్స చేసి తిరుపతి రూయా ఆస్పత్రికి తరలించారు.

శిక్షణ, అవగాహనతోనే రోడ్డు ప్రమాదాల నివారణ

చిత్తూరు రూరల్: సరైన శిక్షణ, అవగాహనతోనే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని, డ్రైవింగ్ శిక్షణలో ఉన్నవారికి మెళకువలు నేర్పి, రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని డీటీసీ నిరంజన్‌రెడ్డి అన్నారు. చిత్తూరులోని తన కార్యాలయంలో మంగళవారం డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులతో ఆయన మాట్లాడారు. డ్రైవింగ్ నేర్చుకునేందుకు వచ్చిన వారికి ముందుగా ట్రాఫిక్ రూల్స్, రోడ్డు భద్రత సూచనలు తదితర అంశాలను తెలియజేయాలన్నారు. దీంతో పాటు కొత్తగా డీఎల్ ఆటోమేటిక్ ట్రాక్ పనితీరును వివరించాలన్నారు. ఈ డీఎల్‌లో ఎక్కువగా ఎక్కడ తప్పిదాలు చేస్తున్నారో..తెలియజేయాల్సి ఉందన్నారు. స్కూళ్ల వాహనాలు మంచి కండిషన్‌లో ఉండాలన్నారు. వాహన చట్టం, శాఖ నియమ నిబంధనలను తప్పక పాటించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంవీఐలు రాజేశ్వరరావు, వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగు ఉత్తమం


రైతులకు అవగాహన కల్పిస్తున్న వాసు

పాలసముద్రం: రైతులు సేంద్రియ ఎరువుల వినియోగానికి ప్రాధాన్యత ఇవ్వాలని చిత్తూరు ఏపీపీఎస్‌ఎఫ్ డీపీఎం వాసు అన్నారు. మంగళవారం శ్రీకావేరిరాజుపురం మిట్ట దళితవాడలో రైతులకు సేంద్రియ వ్యవసాయ సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాసు మాట్లాడుతూ.. సేంద్రియ సాగు ఉత్తమమని తెలిపారు. తక్కువ పెట్టుబడితో నికర ఆదాయం, నాణ్యమైన దిగుబడి వస్తుందని తెలిపారు. రసాయన ఎరువుల వినియోగం వల్ల భూమి సారం కోల్పోతుందన్నారు. పంటలు విషతుల్యం అవుతాయన్నారు. విత్తన శుద్ధికి జీవామృతం, సస్యరక్షణకు గోవు పేడ, మూత్రం, కషాయం వంటివి తయారు చేసి పంటకు వినియోగించవచ్చని తెలిపారు. సేంద్రియ ఎరువులపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం పొలంబడి తదితర కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు. సర్పంచ్ గాలి మహేష్ బాబు పాల్గొన్నారు.

కల్యాణ వైభోగమే..!


అగస్త్యేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

నారాయణవనం: మండలంలో సముదాయంలోని టీటీడీ అనుబంధ మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ఉత్సవమూర్తులకు ఆర్జిత కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. రాత్రి స్వామి వారు అశ్వవాహనంపై గ్రామ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత ఉదయం అర్చకులు నిత్యకైంకర్యాలను పూర్తి చేశారు. ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించి ధూప, దీప, నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం వేద మంత్రోచ్ఛారణ, మంగళ వాయిద్యాల హోరు నడుమ నిర్వహించిన కల్యాణంలో పాల్గొన్న దంపతులకు తీర్థ ప్రసాదాలతో పాటు వస్త్ర బహుమానాన్ని అర్చకులు అందజేశారు. స్థానిక ఆలయాల ఏఈఓ మోహన్, సూపరింటెండెంట్ ఏకాంబరం, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, ఆలయ అర్చకులు రమేష్ గురుకుల్, జమేదార్ విజయకుమార్ తదితరులు పర్యవేక్షించారు. ఉత్సవాలలో బుధవారం ఉదయం నటరాజ ఉత్సవం, సాయంత్రం రావణేశ్వర వాహనంపై స్వామి ఊరేగింపు నిర్వహించనున్నారు.

రికార్డులను సక్రమంగా నమోదు చేయాలి


మాట్లాడుతున్న ఐకేపీ ఏపీఎం

పాలసముద్రం: మండలంలోని వీఓఏలు రికార్డులను సక్రమంగా నమోదు చేయాలని ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్ అన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సీఆర్‌పీ, సీసీఎఫ్, స్త్రీనిధి రికవరీ, ఆరోగ్య పోషణ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్వాక్రా గ్రూపులకు, సిబ్బందికి రికార్డులు ఏ విధంగా రాయాలి, స్త్రీ నిధి రికవరీ, ఇంటి వద్ద పెరిటి కోళ్లు, పెరటి తోటలపై అవగాహన కల్పించారు. డ్వాక్రా మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో పాడి ఆవుల కొనుగోలుకు రూ.50 వేలు వడ్డీ లేని రుణాలు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీసీ చిరంజీవి, లోకనాథం, సంఘమిత్ర మురగయ్య పాల్గొన్నారు.

గడప గడపలో విశేష స్పందన


పథకాల అమలుపై మహిళలతో మాట్లాడుతున్న మంత్రి ఆర్కేరోజా

- మంత్రి ఆర్కే రోజాకు ఘన స్వాగతం
- ప్రభుత్వ పాలనపై సంతోషం వ్యక్తం చేసిన జనం


మంత్రికి గజమాలవేసి హారతి పడుతున్న జనం

నగరి: కష్టాలు మా గడపదాటి లోపలకు రాకుండా ప్రభుత్వం సంక్షేమ పథకాలతో ఆదుకుంటోంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రస్తుత ప్రభుత్వం అన్ని వర్గాలకు చేయూతనిస్తోంది. ప్రజలకు మంచి చేయాలనే ప్రభుత్వం మమ్మల్ని పాలిస్తోంది. ఈ ఆనందాల వేళ మా గడపకు వచ్చారు అందుకోండి గజమాల అంటూ రామ్‌నగర్ ఏ, బీ, సీలోని నివాసితులు మంగళవారం మంత్రి ఆర్కేరోజాను గజమాలలతో సత్కరించి ఆహ్వానం పలికారు. ప్రతి గడపకు వెళ్లిన మంత్రి స్థానికులకు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను వివరించే బుక్‌లెట్లను అందించారు. పథకాలు అందడంలో ఏవైనా సమస్యలు ఉన్నాయా అంటూ ఆరా తీశారు. వారు సూచించిన సమస్యలకు సంబంధిత అధికారుల ద్వారా పరిష్కార మార్గం చూపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతి కుటుంబానికి మంచి చేశాం కనుకే నేడు ధైర్యంగా ప్రతి గడపకు వెళుతున్నామన్నారు. పర్యటనలో ఎక్కడా ప్రజా వ్యతిరేకత కనిపించలేదన్నారు. ప్రజలు ఆనందంగా ఆహ్వానిస్తున్నారన్నారు. పేదలను ఆర్థికంగా ఉన్నత స్థితిలో నిలపాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యమన్నారు. చెప్పిన సమయానికి పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని వివరించారు. గ్రామ స్థాయిలో పాలన ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చారన్నారు. చంద్రబాబు మీడియాను నమ్ముకుని పాలన కొనసాగిస్తే జగనన్న జనాన్ని నమ్ముకున్నారని.. అందుకే ఇంత ఆదరణ వస్తోందన్నారు. ఇంతటి మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని 2024 ఎన్నికల్లోనూ నిండు మనసుతో ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్ చైర్మన్ బాలన్, కౌన్సిలర్లు బిలాల్, భూపాలన్, మున్సిపల్ సచివాలయ కన్వీనర్ దయానిధి, నాయకులు జైలాబ్దీన్, ముబారక్, ఎస్సీ ఆనందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న రాంప్రసాద్‌రెడ్డి

వడమాలపేట: వైఎస్సార్‌సీపీ మండల కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని మంత్రి ఆర్కే రోజా సోదరుడు రాంప్రసాద్‌రెడ్డి కోరారు. బుధవారం ఉదయం 10:30 గంటలకు స్థానిక సీఎంఆర్ గార్డెన్స్‌లో సమావేశం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా ముఖ్య అతిథిగా విచ్చేస్తారని తెలిపారు. గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీ పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చిస్తామన్నారు. పార్టీ నాయకులు తప్పక హాజరుకావాలని కోరారు. శాప్ డైరెక్టర్ యాదవేంద్రరెడ్డి, వైస్ ఎంపీపీ లోకేష్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ సదాశివయ్య, కాయం సింగల్ విండో అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లు సకాలంలో డీడీలు కట్టాలి


డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ బాబు

పాలసముద్రం: రేషన్ డీలర్లు సకాలంలో డీడీలు కట్టాలని తహసీల్దార్ బాబు అన్నారు. మంగళవా రం రెవెన్యూ కార్యాలయంలో మండల పరిధిలోని డీలర్లతో సమావేశం నిర్వహించారు. రేషన్ కార్డుదారులకు పంపిణీ చేస్తున్న బియ్యం, పప్పు, పంచదారకు నిర్ణీత సమయంలో డీడీలు కట్టాలని సూచించారు. పలు గ్రామాల్లో పప్పు, పంచదార ఇవ్వడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని.. అలాంటి పునరావృతం అయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిత్యావసర సరుకులు లబ్ధిదారులకు సక్రమంగా అందుతున్నాయా లేదా అని సంబంధిత వీఆర్వోలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.

ఆకాశంలో వింత వలయం

ఆకాశంలో మంగళవారం రాత్రి మబ్బులతో వింత వలయం ఏర్పడింది. పెద్ద వలయం ఆకాశంలో కనిపించడంతో స్థానికులు వీధుల్లోకి వచ్చి, డాబాలపైకి ఎక్కి ఆసక్తిగా తిలకించారు.

-నగరి

